ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నల్లగొండ

5

మంగళవారం 13 ఆగస్టు 2024

గరిష్ఠం 30.0
కనిష్ఠం 24.0

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	588.80 (308.4658)	68,211	47,035
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.84 (3.65)	961.10	512.42
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	169.42 (37.54)	నిల్	12,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.110 | డ్రెస్ : రూ.150 | స్కిన్‌లెస్ : రూ.180



కనగల్ బీసీ గురుకులంలో నేలపై కూర్చొని చదువుతున్న విద్యార్థులు



నాణ్యతలేని పొంగలిని వృథాగా పడేసిన దృశ్యం.

గురుకులాల్లో అన్నీ సమస్యలే

జిల్లాలోని పలు సంక్షేమ గురుకులాల్లో విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రధానంగా నీటికొరత వేధిస్తుంటే, అరకొర వసతులతో ఇబ్బందులు పడుతున్నారు. కిటికీలకు తలుపులు లేకపోవడంతో దోమల బెడదతో జ్వరాల బారిన పడుతున్నారు. హాస్టళ్ల వద్ద డ్రైనేజీ సదుపాయాలు లేక దుర్గంధం వెదజల్లుతోంది.

- (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి,నల్లగొండ)

- బాలికల గురుకులంలో స్నానానికి నీళ్లు కరువు
- 720మంది విద్యార్థులకు 20 మరుగుదొడ్లతో అవస్థలు
- పొలాల మధ్య భవనాలతో దోమలు, విషపురుగుల బెడద
- డిండిలో ఎలుకలు కరిచినా మారని సిబ్బంది తీరు
- విద్యార్థులకు అందని దుప్పట్లు, కార్పెట్లు, దుస్తులు

జిల్లా కేంద్రంలోని మహాత్మాజ్యోతిరావుఫూలే బీసీ గురుకుల కాంప్లెక్స్‌లో కనగల్ బీసీ గురుకులానికి సంబంధించిన 480 మంది విద్యార్థులు, నార్కట్‌పల్లి బీసీ గురుకులం నుంచి రెండు సెక్షన్లకు చెందిన 80 మంది, మునుగోడు మండలం బోడంగిపర్తి బీసీ గురుకులం నాలుగు సెక్షన్లకు చెందిన 160 మంది మొత్తం 720మంది విద్యార్థులు ఉన్నారు. 5, 6, 7 తరగతుల విద్యార్థుల హాస్టల్‌ను ఒక బ్లాక్‌లో, 8, 9, 10 తరగతుల విద్యార్థులను మరో బ్లాక్ ఉంచారు. ఒక్కో బ్లాక్‌లో పది మరుగుదొడ్లు మాత్రమే ఉండటంతో సరిపడక విద్యార్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలో సైతం పది మరుగుదొడ్లే ఉన్నాయి. దీంతో విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు, స్నానాలు చేసేందుకు రాత్రి నిద్ర మానుకొని క్యూలో నిల్చుంటున్నారు. ఈ భవనం పొలాల మధ్య ఉండడంతో దోమల బెడద ఎక్కువగా ఉంది. గదులకు సగం తలుపులు లేకపోవడం, కిటికీలకు తలుపులు లేకపోవడంతో దోమ తెరలు కూడా లేకపోవడంతో దోమలు కుట్టి విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నారు. మెనూ కూడా సరిగా అమలవడం లేదని, ఆహారం నాణ్యత లోపించిందని విద్యార్థులు చెబుతున్నారు. కాంట్రాక్ట్ గడువు ముగుస్తుండడంతో నెల రోజుల నుంచి కోడిగుడ్లు పెట్టడం లేదని తెలిపారు. వారానికి ఐదు రోజులు గుడ్లు పెట్టాల్సి ఉండగా, దాన్ని నిలిపివేశారు. సాంబారు నీళ్లచారులా, పొంగలి రుచిగా లేకపోవడంతో విద్యార్థులు సగం తినకుండా వదిలేస్తున్నారు. విద్యా సంవత్సరం మొదలై రెండునెలలు గడిచినా కార్పెట్లు, దుప్పట్లు ఇవ్వలేదు. బెడ్‌లపై పరుపులు లేక ఇనుపమంచాలపై ఇంటినుంచి తెచ్చుకున్న దుప్పట్లు పరుచుకొని నిద్రపోతున్నారు. మూడు జతల దుస్తులు ఇవ్వాల్సి ఉండగా, ఇంకా సరఫరా చేయలేదు. వస్త్రం వచ్చిందని, కుట్టుకు ఇచ్చామని రాగానే సరఫరా చేస్తామని అధికారులు చెబుతున్నారు. సరిపడా బెంచీలు లేక బోడంగిపర్తి, నార్కట్‌పల్లి నుంచి తరలించిన సెక్షన్లకు సంబంధించిన విద్యార్థులు తరగతి గదుల్లో నేలపైనే కూర్చుంటున్నారు.



పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారం

కొండమల్లేపల్లిలో డ్రైనేజీ సమస్య, కోతుల బెడద

కొండమల్లేపల్లి ఎస్సీ బాలికల గురుకులంలో 623 మంది విద్యార్థినులు ఉండగా, ఇక్కడ డ్రైనేజీ సమస్య వేధిస్తోంది. కోతుల బెడదతో బాలికలు బెంబెలెత్తిపోతున్నారు. డ్రైనేజీ పైప్‌లైన్ లీకవడం, అవుట్‌లెట్ లేకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో పాటు కోతులు, కుక్కల బెడద ఎక్కువగా ఉందని,ప్రహరీలేక అవి యథేచ్ఛగా తిరుగుతున్నాయని, దీంతో బయటికి రాలేకపోతున్నామని బాలికలు చెబుతున్నారు.

కొమ్మపల్లిలో తేళ్ల బెడద

దేవరకొండ మండలం కొమ్మపల్లిలో ఉన్న గిరిజన గురుకులం పంట పొలాల మధ్య ఉండటంతో ప్రహరీలేక తేళ్ల, పాములు, విషపురుగుల బెడద ఎక్కువైంది. ఈ సమస్యను అధికారులకు విన్నవించినా స్పందన లేదని విద్యార్థుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాలికల స్నానానికి నీళ్లు కరువు

నల్లగొండలోనే ఉన్న నిడమనూరు ఎస్సీ బాలికల గురుకులం పరిస్థితి దయనీయంగా ఉంది. ఇక్కడ 700 మంది బాలికలు వసతి పొందుతున్నారు. ప్రధానంగా నీటికొరత వేధిస్తోంది. ఇక్కడ నాలుగు బ్లాకులు ఉండగా, అన్నింటిలో తాగునీరు, రన్నింగ్ వాటర్ సమస్య ఉంది. బోర్లు పనిచేయకపోవడంతో మిషన్‌భగీరథ పైప్‌ల నుంచి వచ్చిన నీటినే డ్రమ్ముల్లో పట్టి విద్యార్థులు వినియోగిస్తున్నారు. స్నానాలకు సరిపడా నీరు అందడం లేదు. బ్లాకుకు నాలుగు డ్రమ్ములే ఉన్నాయి. ఆ నీటినే రోజువారీ వినియోగించుకుంటున్నారు.

ఎలుకలు కరిచినా మారని తీరు



డోర్లు లేని మరుగుదొడ్లు

డిండిలోని ఎస్సీ గురుకులంలో నిర్వహణ అధ్వానంగా ఉంది. ఇక్కడ తాగునీటికి అవస్థలు పడాల్సి వస్తోంది. సరిపడా నీరులేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీల మరమ్మతులు చేయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఒకవైపు ప్రహరీ లేక కోతులు, కుక్కల బెడద ఎక్కువగా ఉంది. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో ఎలుకలు సంచరిస్తున్నాయి. జూలై నెలలో 16 మంది విద్యార్థులకు ఎలుకలు కరవగా, దేవరకొండ తరలించి చికిత్స చేయించారు. అయినా గురుకులం నిర్వహణలో సిబ్బంది తీరు మారడం లేదు. భోజనం నాణ్యంగా ఉండడం లేదని, మెనూ పాటించడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.



చింతపల్లి మండలం ఈదులగండి రిజర్వాయర్ వద్ద అధికారులతో నిర్వాసితుల వాగ్వాదం (ఫైల్)

ఏళ్లుగా... ఎదురుచూపులే

- నిర్వాసితులకు కొలిక్కిరాని నష్టపరిహారం
- కొందరికే పంపిణీ

చింతపల్లి, ఆగస్టు 12 : ప్రాజెక్టుల భూసేకరణ పరిహారం చెల్లింపులు కొలిక్కిరావడం లేదు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలను పూర్తి చేసేందుకు సీఎం రేవత్ రెడ్డి సర్కార్ నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా డిండి ఎత్తిపోతల పథకానికి సైతం ఇటీవల బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయించారు. రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించారు. ఈ పథకం కింద చేపట్టిన గొట్టిముక్కల, సింగరాజుపల్లి, చర్లగూడెం, శివన్నగూడెం రిజర్వాయర్ పనులు ఇప్పటివరకు 80 శాతం పూర్తి కాగా కిష్టరాయనిపల్లి రిజర్వాయిర్ భూసేకరణ సమస్య నేటికీ తీరలేదు. రైతులకు సాగు, తాగునీటి కోసం రిజర్వాయర్లను మూడేళ్లలో పూర్తి చేసి 3.11 లక్షల ఎకరాలకు నీటిని అందించాలని 2014 జూన్‌లో సీఎం కేసీఆర్ రూ.6.190 కోట్ల విలువైన ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు. ప్రాజెక్టు పనులకు అవసరమైన భూసేకరణ చేసి రిజర్వాయర్లను త్వరగా పూర్తి చేయాలని పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లారు.

రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి బహిరంగ మార్కెట్ ధర కంటే తక్కువ నష్టపరిహారం చెల్లిస్తుండటంతో భూనిర్వాసితులు తమ భూములు ఇచ్చేందుకు ముందుకురాలేదు. నిర్మాణ దశలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలుచేయకపోగా, కొన్నిచోట్ల భూనిర్వాసితులకు ఏళ్ల గడుస్తున్నా పూర్తిస్థాయిలో నష్టపరిహారం ఇవ్వలేదు. సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో ప్రాజెక్టు నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. ఇటీవల అసంపూర్తి ప్రాజెక్టుల పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలో భూములు ఇచ్చేందుకు నిరాకరించిన రైతులకు నోటీసులు జారి చేయడంతో రైతులకు తీవ్ర ఆందోళన మొదలైంది.

మూడెకరాలకు ఎకరానికే పరిహారం ఇచ్చారు



ఈదులగండి వద్ద నిర్మించే రిజర్వాయిర్‌తో నా భూమి పోతుంది. ప్రాజెక్టు పనులకు భూసేకరణ చేసి మూడు ఎకరాల భూమి కావాలని అధికారులు గుర్తించి సంతకాలు చేసుకున్నారు. కేవలం ఎకరానికి రూ.5.15 లక్షలు నష్టపరిహారం అందించారు. మిగతా డబ్బులు ఇవ్వలేదు.

- మధుకర్, భూనిర్వాసితుడు(కిష్టరాయనిపల్లి).

వినతులు ఇచ్చినా ప్రయోజనం లేదు



ప్రాజెక్టు పనుల్లో భూములు కోల్పోతున్నాం. న్యాయం చేయాలని జిల్లా స్థాయి అధికారులకు వినతులు అందజేశా. రాజకీయ నాయకులు కేవలం హామీలతో కాలయాపన చేస్తున్నారు. మార్కెట్ ధర ఎక్కువ ఉంది. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ద్వారా నష్టపరిహారం చెల్లించాలి.

- వెంకటయ్య, (కిష్టరాయనిపల్లి),నిర్వాసితుడు

న్యాయం చేసేందుకు కృషి



ప్రాజెక్టు భూనిర్వాసితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తా. సమావేశంలో భూములు కోల్పోతున్న రైతులకు తగిన నష్టపరిహారం కోసం చర్చించి తగిన న్యాయం చేసేందుకు కృషి చేస్తా.

- నేనావత్ బాలునాయక్, ఎమ్మెల్యే (దేవరకొండ)

చింతపల్లి మండలంలో భూసేకరణ సమస్య

చింతపల్లిలో 0.94 టీఎంసీలతో నిర్మించే రిజర్వాయర్ నిర్మాణానికి చింతపల్లి, నసర్లపల్లి, మల్లారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన భూమిని సేకరించాల్సి ఉంది. ఇందులో పెద్ద, చిన్నా చెరువుల కింద 333 ఎకరాల భూమి పోనూ మిగతా భూమిని రైతుల నుంచి ప్రభుత్వం సేకరించాల్సి ఉంది. సేకరణలో భాగంగా రైతులకు విడతల వారీగా నష్టపరిహారం అందించారు. మొదటి విడతలో ఎకరానికి రూ.4.15 లక్షలు చొప్పున 1,209 ఎకరాలు, రెండో విడతలో రూ.5.15 లక్షలు నష్టపరిహారంతో 759 ఎకరాల భూమిని సేకరించేలా అధికారులు ప్రణాళికలు రుపొందించారు. అయితే కొందరికే నష్టపరిహారం అందించారు. ఇదీ కాక 2016లో 197 మంది రైతులు ప్రాజెక్టు నిర్మాణానికి భూములు ఇచేందుకు ముందుకు వచ్చి అధికారులకు వివరాలను అందించినా వారికీ నష్టపరిహారం అందజేయలేదు.

ప్రజలకు పోలీస్‌శాఖను మరింత చేరువ చేస్తాం



అర్జీదారుడితో మాట్లాడుతున్న ఎస్పీ

నల్లగొండ, ఆగస్టు 12 : ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తున్నామని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. సోమవారం గ్రీవెన్స్‌డే సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 55మంది అర్జీదారులతో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం ఫోన్‌లో సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ వచ్చిన ఫిర్యాదు దారులతో మర్యాదగా మాట్లాడి వినతులను స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ప్రతీ ఫిర్యాదుదారుడికి భరోసా, నమ్మకం కల్పించాలన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేకమైన చర్యలకు పాల్పడినా, శాంతిభద్రతలకు భంగం కలిగించినా కఠినంగా వ్యవహరించాలన్నారు. బాధితుల ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నామన్నారు.

డబ్బు తీసుకుని మోసం చేశారని ఎస్పీకి ఫిర్యాదు

అప్పుల రూపంలో డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు బాధితులు ఎస్పీ శరత్ చంద్రపవార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. నకిరేకల్‌కు చెందిన ఓ మహిళా మొత్తం 14మంది నుంచి సుమారు రూ.1.80 కోట్లు అప్పుల రూపంలో తీసుకొని పరారైందని తెలిపారు. డబ్బుతో పరారైన ఆమె ఆచూకీ తెలుసుకొని న్యాయం చేయాలని కోరుతూ టీ వనిత, పీ రాధిక, ఎండీ హజీరా, పీ నరేష్, వెంకట్‌రెడ్డిలు ఫిర్యాదు చేశారు.

కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



కంపచెట్లు వ్యర్థాలతో నిండిన మేజర్‌కాల్వను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి

మిర్యాలగూడ, ఆగస్టు 12: సాగర్ ఎడమకాల్వ పరిధిలోని మేజర్ కాల్వల్లో పూడికతీత పనులు వెంటనే చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని గూడూరు గ్రామ శివారులోని కిష్టాపురం మేజర్‌కాల్వను ఆయన పరిశీలించి మాట్లాడారు. గత ఏడాది వర్షాలు లేకపోవడంతో మూడు సీజన్లలో పంటలకు సాగునీరు లేకపోవడంతో కాల్వలు, కుంటల్లో కంపచెట్లు, పిచ్చిమొక్కలు, వ్యర్థాలతో నిండాయన్నారు. ప్రస్తుతం ఎడమకాల్వకు సాగునీటిని విడుదల చేయడంతో నీటి ప్రవాహానికి అడ్డుగా మారాయని, దీంతో చివరి భూములకు సాగునీరు అందడంలేదన్నారు. వెంటనే కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టి ఆయకట్టు చివరి భూములకు నీరందేలా చూడాలని డిమాండ్ చేశారు. అనంతరం పరిస్థితిని ఎన్ఎస్పీ సీఈ నాగేశ్వరరావు, ఈఈ లక్ష్మణ్‌నాయక్‌కు ఫోన్‌లో వివరించారు. ఆయన వెంట నాయకులు డబ్బికార్ మల్లేష్, జగదీశ్‌చంద్ర, రాగిరెడ్డి మంగారెడ్డి, రవినాయక్, పిల్లుట్ల సైదులు, బాలాజీనాయక్, సాగర్ నాయక్, సత్యనారాయణ, శ్రీను, హనుమంతు నాయక్, మంగ, శ్యామ్, తదితరులు ఉన్నారు.

‘నేను గంజాయి వాడను’

- నినాదంతో ప్రజల్లోకి : కలెక్టర్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ టౌన్, ఆగస్టు 12: ‘నేను గంజాయి వాడను’ నినాదంతో ఈ నెల 14 నుంచి వారం రోజులపాటు జిల్లాలో సామాజిక మాధ్యమాలు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ‘మిషన్ పరివర్తన్’లో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రకాల వార్తలను ప్రజల్లోకి వేగంగా తీసుకెళ్లేది మీడియా మాత్రమేనని, మాదక ద్రవ్యాల నియంత్రణలో మీడియా పాత్ర ముఖ్యమన్నారు. యువకులు గంజాయి, మత్తు ట్యాబ్లెట్లు డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండానే వినియోగిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో భాగంగా వారం రోజులుగా జిల్లాలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 14 నుంచి సామాజిక మాధ్యమాల ద్వారా ‘నేను గంజాయి వాడను’ అనే నినాదంతో ప్రచారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ మత్తుపదార్థాలు తీసుకోవడంతో కలిగే పరిణామాలపై వారం రోజులు ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

విద్య, వైద్య, పోలీస్, ఎక్సైజ్, వ్యవసాయ, తదితర శాఖల ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. వారం రోజుల్లో 120 మందికి కౌన్సిలింగ్ సైతం ఇచ్చామన్నారు. గంజాయి నుంచి బయటపడిన వారికి రిహాబిలిటేషన్ సెంటర్ ఏర్పాటుకు కలెక్టర్ అంగీకరించడంపై కృతజ్ఞతలు తెలిపారు. నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రిలో రెండు రిహాబిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు సంబంధించి సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 8712670266కు తెలియజేయాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అంతకు ముందు సైక్రియాటిస్ట్ శివ మాట్లాడుతూ, గంజాయి వల్ల కలిగే నష్టాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములునాయక్, డీఎంహెచ్‌వో పోట్ల శ్రీనివాసులు, ఎక్సైజ్ ఈఎస్ సంతోష్, చాణక్య, జిల్లా పౌర సంబంధాల అధికారి యు.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజావాణి’ ఫిర్యాదులు పరిష్కరించాలి

ప్రజావాణి ఫిర్యాదులు ఎప్పటికప్పుడే పరిష్కరించాలని అధికారులకు కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకొని మాట్లాడారు. ‘ప్రజావాణి’లో మొత్తం 69 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్లు పూర్ణచంద్ర, శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్జీ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ క్లాక్ టవర్ వరకు కొనసాగింది. అనంతరం మానవహారం నిర్వహించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా మిర్యాలగూడ, హాలియా, దేవరకొండ, నాంపల్లి, చండూరు, నకిరేకల్ ప్రధాన కేంద్రాల్లో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్సైజ్‌శాఖ ఈఎస్ బి.సంతోష్, బి.చాణక్య, ఎ.కిషన్, రాకేష్, బి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందించడం అభినందనీయం

ప్రతీ నియోజకవర్గంలోని ఒక ప్రభుత్వ పాఠశాల, ఆసుపత్రిని ఆధునికీరించే కార్యక్రమంలో ఉద్యోగులు భాగస్వాములు కావడం అభినందనీయమని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దే క్రమంలో జిల్లా అధికారుల సంఘంతో పాటు టీజీవోలు, టీఎన్జీవోల అసోసియేషన్ అన్ని సంఘాలు ముందుకు వచ్చి ఒకరోజు వేతనాన్ని విరాళంగా ప్రకటించడాన్ని ఆయన అభినందించారు. సోమవారం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో భాగంగా ఆయన ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ, ఒకరోజు వేతనాన్ని ఇచ్చేందుకు సమ్మతించిన అధికారులందరూ తక్షణమే వారి సమ్మతిని రాతపూర్వకంగా జిల్లా కోశాధికారికి తెలియజేయాలన్నారు.

16 నుంచి వారం పాటు ఫీవర్ సర్వే

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 16 నుంచి వారం రోజుల పాటు మరోసారి ఫీవర్ సర్వే నిర్వహించాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు.సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారుల సమ్మిళిత సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశా, అంగన్‌వాడీలు ఇంటింటికీ తిరిగి జ్వర సర్వేలో వివరాలు సేకరించాలన్నారు. ఈ నెలాఖరు నాటికి శాఖల ద్వారా ఇప్పటివరకు పరిష్కరించిన ఫిర్యాదులను తనిఖీ నిర్వహిస్తామన్నారు. సెప్టెంబరు 1 నుంచి జిల్లా మొదలుకొని గ్రామపంచాయతీ వరకు ఉద్యోగులకు అటెండెన్స్ యాప్‌ను నిర్వహించనున్నామని, ఉద్యోగులందరూ తప్పనిసరిగా సమయానుకూలంగా పనిచేయాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టీ పూర్ణచంద్ర, అదనపు కలెక్టర్ జే శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఆర్‌వో డీ రాజ్యలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు సుంకిశాలలకు బీజేపీ ఎమ్మెల్యేల బృందం

నాగార్జునసాగర్, ఆగస్టు 12 : నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ సమీపంలో పెద్దవూర మండలంలోని సుంకిశాల ప్రాజెక్టును బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డితో పాటు ఆ పార్టీ ఎమ్మెల్యేల బృందం పరిశీలించనుంది. ఉదయం 8గంటలకు రోడ్డు మార్గంలో హైదరాబాద్ నుంచి బయలుదేరి 10 గంటలకు సుంకిశాలకు చేరుకోనున్నారు. ఈ నెల 2వతేదీన కూలిన పంప్‌హౌస్ రక్షణగోడను పరిశీలించనున్నారు.

హరిహరులకు విశేష పూజలు

భువనగిరి అర్బన్, ఆగస్టు 12 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపై సోమవారం హరిహరులకు విశేష పూజలు కొనసాగాయి. స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, కొండపైన పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామివారికి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్ర రీతిలో నిత్యకైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాతసేవతో స్వామిఅమ్మవార్లను మేల్కొల్పిన అర్చకస్వాములు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీదళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి విశ్వక్సేనుడికి తొలిపూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహిం చారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమ శాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటికమూర్తును అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.17,71,886 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

భక్తుల రక్షణ కోసం షెడ్డు

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కొండపై ఎండ, వాన నుంచి భక్తుల రక్షణ కోసం జర్మన్ టెక్నాలజీ హ్యాంగర్ ఫ్యాబ్రిక్ షెడ్డు అందుబాటులోకి తెచ్చారు. ఈ మేరకు ఆదివారం రాత్రి నుంచి ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభించి తెల్లవారుజాము వరకు పూర్తిచేశారు. ఆలయ అందాలకు అడ్డుగా ఉందనే అభిప్రాయాల మేరకు ఉత్తర రాజగోపురం తర్వాత నిర్మించిన ఈ షెడ్డుతో భక్తులకు ఎంతో కొంత నీడ లభించడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎండ తీవ్రత ఇంకా తగ్గకపోవడం, అకస్మాత్తుగా కురిసే వర్షానికి భక్తులు తలదాచుకునే చోటులేక ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఆలయ అధికారులు తిరిగి ఆలయ ఉత్తర తిరుమాఢ వీధుల్లో భారీషెడ్డును అందుబాటులోకి తెచ్చారు. గతంలో ఈ షెడ్డు ఏర్పాటుతో ఆలయ సహజత్వం, అందాలకు అడ్డుగా మారిందని కొంత మంది భక్తుల నుంచి విమర్శలు రాగా రథశాల ముందు గ్రీనరీ భాగం నుంచి రిటైనింగ్ వాల్ వెంట నేరుగా కొండ కింది వైకుంఠ ద్వారం వరకు శాశ్వతంగా షెడ్డు నిర్మించేందుకు ప్రతిపాదనలు దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి పంపినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. దీని వెంట వేసవిలో చలువ పందిళ్ల ఏర్పాటు చేయగా ఇందుకోసం రిటైనింగ్ వాల్ వెంట ఉన్న చెట్లను కూడా తొలగించారు. త్వరలో ప్రతిపాదనలు మోక్షం కలగనుండగా అప్పటి వరకు భక్తులు సేద తీరేందుకు తిరిగి షెడ్డు అందుబాటులోకి తెచ్చినట్లు సివిల్ ఈఈ దయాకర్‌రెడ్డి తెలిపారు.



శివాలయంలో స్ఫటికలింగానికి హారతిఇస్తున్న అర్చకుడు

ఖమ్మం నుంచి భక్తుడి పాదయాత్ర

రేవంత్‌రెడ్డి సీఎంగా అధికారం చేపట్టినందుకు ఖమ్మం జిల్లాకు చెందిన ఎర్రనాగుల రమేష్‌నాయక్ తన అభిమానాన్ని చాటుకున్నారు. ఖమ్మం నుంచి పాదయాత్ర ప్రారంభించి సోమవారం యాదగిరిగుట్టకు చేరుకొని వైకుంఠ ద్వారం(స్వామివారి పాదాలు) చెంత సీఎం చిత్రపటంతో మొక్కు తీర్చుకున్నాడు. అనంతరం కొండపైన శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించుకొని పూజలు చేపట్టి మొక్కు తీర్చుకున్నాడు. వంద రోజుల దీక్షలో భాగంగా శాకాహార భోజన నియమాలతో క్షేత్ర సందర్శన చేసినట్లు భక్తుడు తెలిపారు. మరో ఐదేళ్ల పాటు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రేవంత్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని ఏకశిఖరవాసుడిని కోరుకున్నట్లు తెలిపాడు.

దేవస్థానం పాలకమండలి నియమించాలి

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి సంబంధించి పాలకమండలిని నియమించాలని భాగ్యనగర్ అర్చక, పురోహిత సంఘం అధ్యక్షుడు గట్టు శ్రీనివాసాచార్యులు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యను కోరారు. సోమవారం యాదగిరిగుట్టలో అయిలయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. కొన్నేళ్లుగా ఆలయాల్లో పాలకమండలి నియామకం జరగలేదని, పాలకమండలిని నియమించి దేవాలయాల అభివృద్ధికి తోడ్పాటును అందించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఉడుత యాదగిరి, నలుబాల ఎర్రయ్య ఉన్నారు.

కదిలిన యంత్రాంగం

● ఎర్రబెల్లి, గోపాలపురం గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు
● జర్వ బాధితుల నుంచి రక్త నమూనాలు సేకరణ
● పారిశుధ్య లోపమే కారణమని అధికారుల వెల్లడి



నిడమనూరు: ఎర్రబెల్లిలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది



హుజూర్‌నగర్: గోపాలపురం గ్రామస్థులతో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

నిడమనూరు, హుజూర్‌నగర్, ఆగస్టు 12: నల్లగొండ జిల్లా నిడమానూరు మండలంలోని ఎర్రబెల్లి, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలోని గోపాలపురం గ్రామాల్లో జ్వరాలతో బాధపడుతున్న బాధితుల కోసం ఆయా జిల్లాల వైద్యాధికారులు కదిలారు. 'నిడమనూరుకు జ్వరమొచ్చింది' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎర్రబెల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో 330 ఇళ్లకు వెళ్లి జ్వరాలపై సర్వే చేశారు. గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పలువురి నుంచి రక్త నమూనాలు కూడా సేకరించారు. సాధారణ జ్వరాలే అని నిర్ధారించారు. జ్వరాలు వ్యాపించడానికి గల కారణాలు వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో వైద్య సిబ్బందితో పర్యటించి నీటిని పరిశీలించారు. నిల్వ ఉన్న నీటిలో లార్వాను అరికట్టేందుకు ఆయిల్ బాల్స్ వదిలారు. వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. గ్రామంలో దోమల నివారణ కోసం తరచూ ఫాగింగ్ చేయాలని నల్లగొండ జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో కేశ రవి అధికారులకు సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పారిశుధ్యం లోపించడం కారణంగానే జ్వరాలు వస్తున్నాయని, సీజనల్ వ్యాధులు రావడం సహజమేనన్నారు. సాధారణ జ్వరాలేనని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జ్వరాలు పూర్తిగా నివారించేందుకు వైద్య శిబిరాలు కొనసాగించి వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రఫి, సీహెచ్‌వో రమేష్, హెచ్‌ఈవోలు ప్రభాకర్, వాసుదేవరెడ్డి, పీహెచ్ఎన్ రజని, గంటా సోమయ్య, జోసెఫ్, మంజుల, సుచిత్ర, స్వప్న, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గోపాలపురంలో తొమ్మిది బృందాలతో సర్వే

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలోని గోపాలపురంలో జిల్లా వైద్యశాఖాధికారులు తొమ్మిది బృందాలు గ్రామంలో ఇంటింటి సర్వే చేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో నిరంజన్ మాట్లాడుతూ వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు వస్తాయని, వాటిని దరిచేరనీయవద్దన్నారు. గృహ పరిసరాలలో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. మలేరియా, చికున్‌గున్యా, డెంగ్యీ, టైఫాయిడ్ లాంటి విష జ్వరాలు ఒకరి నుంచి ఒకరికి వస్తాయన్నారు. కలుషితమైన ఆహారపదార్థాలు, ఈగలు, దోమలు వాలిన ఆహారాలు తినడం వల్ల కూడా ఈ వ్యాధులు వస్తాయన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ వేడివేడి ఆహార పదార్థాలు తినాలన్నారు. కాచి వడపోసిన నీటిని తాగాలన్నారు. విషజ్వరాలు అదుపులో ఉన్నాయన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మెడికల్ క్యాంప్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కల్యాణి, పద్మ, ఇందిరాల రామకృష్ణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నల్లబండగూడెం, అమీనాబాద్‌లో ఫీవర్ సర్వే

కోదాడ రూరల్, అనంతగిరి: కోదాడ మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల నల్లబండగూడెం గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా ఆరోగ్య సిబ్బంది సోమవారం ఇంటింటికీ తిరిగి రక్త నమూనాలు సేకరించారు. వైద్యాధికారి రంజిత్‌కుమార్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో ఉపేందర్, పీహెచ్ఎన్ అనంతలక్ష్మి, సూపర్‌వైజర్ ఉమామహేశ్వరి, యాతాకుల మధుబాబు పాల్గొన్నారు. అనంతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అమీనాబాద్ గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతన్న దృష్ట్యా సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరాలతో ఉన్న రోగులను గుర్తించి రక్త నమూనాలను సేకరించారు.

'సాగర్' క్రస్ట్ గేట్లు మూసివేత

● ఎనిమిది రోజుల్లో 174.82 టీఎంసీల నీటి విడుదల



మూసి ఉన్న నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ప్రాజెక్టు గేట్లు

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, ఆగస్టు 12: నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో మూసివేశారు. సాగర్‌కు ఎగువనుంచి వరద రాక తగ్గడంతో క్రస్ట్ గేట్లను మూసివేసినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. కృష్ణాబేసిన్‌లో సాగర్‌కు ఎగువన ఉన్న ప్రాజెక్టులన్నీ నిండడంతో సాగర్‌కు జూలై 29వ తేదీ నుంచి శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వరద రాక మొదలైంది. దీంతో సాగర్ నీటిమట్టం పూర్తిస్థాయికి చేరువ కావడంతో ఈ నెల 5వ తేదీన క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. మొత్తం ఎనిమిది రోజుల్లో క్రస్ట్ గేట్ల ద్వారా 174.82 టీఎంసీల నీటిని సాగర్ నుంచి దిగువకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. దీంతో సాగర్ నుంచి ఎనిమిది రోజుల్లో మొత్తం 174.82 టీఎంసీల నీరు కడలి పాలైంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు (215.6070 టీఎంసీలు) కాగా, శ్రీశైలానికి ఎగువనుంచి 77,598 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో సోమవారం సాయంత్రానికి శ్రీశైలం నీటి మట్టం 881.20 అడుగులుగా(194.3096టీఎంసీలు) ఉంది. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 68,211 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు(312.5050 టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి 588.80 అడుగులుగా(308.4658టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 6,253 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 8,541 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,841 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 47,035 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 68,211 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. ఈ నెల 5వ తేదీన సాగర్ ప్రాజెక్టు గేట్ల ద్వారా నీరు విడుదల చేయడంతో ఎనిమిది రోజుల పాటు పర్యాటకుల సందడి నెలకొంది. సోమవారం గేట్లన్నీ మూసివేయడంతో పర్యాటకులు లేక సాగర్ పరిసర ప్రాంతాలు బోసిపోయి కనిపించాయి.

'మూసీ'కి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో.. గేట్లు మూసివేత

మూసీ ప్రాజెక్టుకు ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. మూసీ నది ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద నీరు దిగువన గల ప్రాజెక్టుకు వచ్చి చేరుతోంది. ఎగువ నుంచి ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో ఆదివారం సాయంత్రానికి 731.24క్యూసెక్కులు ఉండగా, సోమవారం సాయంత్రానికి కొంత మేరతగ్గి 961.10క్యూసెక్కులుగా నమోదైంది. 645అడుగుల(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటి మట్టం సోమవారం సాయంత్రానికి 641.84అడుగులుగా (3.65టీఎంసీ) ఉంది. మరోవైపు మూసీ ఆయకట్టులో వానాకాలం పంటల సాగు కోసం ప్రాజెక్టు కుడి కాల్వకు 256.21 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 256.21 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

'పులిచింతల' ప్రాజెక్టుకు ఆగిన వరద

ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలోని పులిచింతల ప్రాజెక్టుకు ఎగువనుంచి వరద నిలిచిపోవటంతో సోమవారం సాయంత్రం ప్రాజెక్టు రేడియల్ క్రస్ట్ గేట్లను మూసివేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175అడుగులు(45.77 టీఎంసీలు)గా కాగా, సోమవారం సాయంత్రానికి 169.42 అడుగులుగా(37.54 టీఎంసీలు) నమోదైంది. తెలంగాణ జెన్కో జల విద్యుత్ కేంద్రానికి 12వేల క్యూసెక్కుల వరద నీటిని వినియోగిస్తూ, నాలుగు యూనిట్ల ద్వారా 80మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ప్రాజెక్టు అవుట్ ఫ్లో 12వేల క్యూసెక్కులు కాగా, ఎటువంటి ఇన్‌ఫ్లో లేదు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని బయటికి తెస్తున్న గ్రామస్థులు

చిలుకూరు, గరిడేపల్లి, ఆగస్టు 12: నల్లగొండ జిల్లా చిలుకూరు మండలంలోని పోలేనిగూడెం పరిధిలో గల సాగర్ కాల్వలో సోమవారం మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం... గరిడేపల్లి మండలంలోని వెలిదండ గ్రామంలో ఆదివారం ఓ వివాహానికి హాజరైన హుజూర్‌నగర్‌కు చెందిన లచ్చిమల్ల వెంకట్(21) సాగర్ కాల్వలో ఈతకు దిగి ప్రమాదవశాత్తు కొట్టుకుపోయాడు. సోమవారం ఉదయం పోలేనిగూడెం పరిధిలోని అగ్రికల్చర్ కళాశాల సమీపంలో సాగర్ కాల్వలో వెంకట్ మృతదేహం తేలియాడడంతో గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని బయటికి తీసి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ రాంబాబు తెలిపారు.

పొలంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



చింతపల్లి: నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని ప్రశాంతిపూరితండా హైవే సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ప్రశాంతిపూరి తండాకు చెందిన కేతావత్ చంద్ వ్యవసాయ పొలంలో ఎలాంటి గాయాలు లేకుండా గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేశారు. మృతదేహంపై కుడి చేతిపై యాదవ్(జేఈ) అనే టాటూన్ ఉందని పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య

● అప్పుల బాధ తాళలేక రైతు ● రైలుకింద పడి యువకుడు ● పురుగుల మందు తాగి వివాహిత

నాగార్జునసాగర్, భువనగిరి రూరల్, అడ్డగూడూరు, ఆగస్టు 12: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. అప్పుల బాధతాళలేక నల్లగొండ జిల్లా పెద్దవూర మండల పరిధిలోని చింతపల్లితండాలో రైతు, యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మునిసిపల్ పరిధిలోని రాయిగిరికి చెందిన యువకుడు, అడ్డగూడూరు మండలంలోని కంచనపల్లి గ్రామంలో వివాహిత ఆత్మహత్య చేసుకుంది.

అప్పులు చేసి బోర్లు వేసి..



కృష్ణ(ఫైల్)

నల్లగొండ జిల్లా పెద్దవూర మండల పరిధిలోని చింతపల్లితండాకు చెందిన జటావత్ కృష్ణ(40) తనకున్న 10ఎకరాల్లో పత్తి, మిర్చి పంటలతో పాటు బత్తాయి తోట పెట్టాడు. బత్తాయి తోట ఎండిపోతుండడంతో ఎనిమిది బోర్లు వేయించాడు. వ్యవసాయం, బోర్లు వేయించేందుకు సుమారు రూ.10లక్షల వరకు అప్పులు చేశాడు. బోర్లు పడక పోగా తోట ఎండిపోయే దశకు వచ్చింది. దీంతో అప్పులు ఎలా తీర్చాలని కొద్దిరోజులుగా మనస్తాపంతో ఉన్న కృష్ణ సోమవారం ఉదయం 9 గంటల సమయంలో ఇంట్లో నుంచి వెళ్లాడు. మండల పరిధిలో పెద్దగూడెం స్టేజీ సమీపంలో పురుగుల మందు తాగి పడుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. చికిత్సనిమిత్తం నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. కృష్ణకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు.

నాన్న.. తమ్ముడిని మంచిగా చూసుకో..

భువనగిరి మునిసిపల్ పరిధిలోని రాయిగిరికి చెందిన లస్కర్ మధు(27) రెవెన్యూ అడిషినల్ కలెక్టర్ వద్ద ఔట్‌సోర్సింగ్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం విధులకు హాజరు కాలేదు. సాయంత్రం రాయిగిరి రైల్వే స్టేషన్ సమీపంలో తన ద్విచక్ర వాహనాన్ని రైలు పట్టాల సమీపంలో నిలిపివేసి సెల్‌ఫోన్‌ను, రూ.200 నోట్‌ను బైక్ ముందు కవర్‌లో పెట్టి సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్‌కు వెళ్తున్న భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న రైల్వే హెడ్ కానిస్టేబుల్ సంఘటనా స్థలం వద్ద బైక్ కవర్ లోపల ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా మృతుడి ఆచూకీ కనుగొని మధు తండ్రి రాజుకు సమాచారం ఇచ్చారు. లభ్యమైన రూ.200 నోట్‌పై అన్నయ్య అమ్మ, నాన్న, తమ్ముడిని మంచిగా చూసుకో.. ఐ మిస్.. ఐ లవ్ మై ప్యామిలీ .. నా వల్ల కావట్లేదు' అని రాసి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లాకేంద్ర ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జె. కృష్ణారావు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.



మధు(ఫైల్)

ఇంట్లో ఉంచిన పురుగుల మందు తాగి..



కవిత(ఫైల్)

యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని కంచనపల్లి గ్రామానికి చెందిన భాష బోయిన యాదగిరి, అతని భార్య కవిత(30) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం పత్తి చేనుకు పురుగుల మందు కొట్టాలని యాదగిరి పురుగుల మందుల తెచ్చి ఇంటి లోపల పెట్టి బయటికి వెళ్లాడు. కవిత ఆ పురుగుల మందు తాగింది. స్థానికులు గమనించి యాదగిరికి సమాచారం ఇచ్చారు. వెంటనే చికిత్స నిమిత్తం తిరుమలగిరి మండలంలోని ఓ ప్రైవేట్ అసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. కవిత సోదరుడు సోమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

కారు అదుపుతప్పి లారీని ఢీకొని..

దామరచర్ల, ఆగస్టు 12: కారు అదుపుతప్పి డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా దామరచర్ల మండల కేంద్రంలోని వీరభద్రాపురంలోని నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై సోమవారం జరిగింది. ఎస్ఐ ఇరుగు రవి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌కు చెందిన ఆదిపూడి శ్రీనాథ్(40) స్థానికంగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య సింధు పిల్లలతో కలిసి గుంటూరులో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంది. ఈ క్రమంలో శుక్రవారం విధులు ముగించుకున్న శ్రీనాథ్ రెండు రోజులు సెలవు కావడంతో గుంటూరులోని భార్య వద్దకు వెళ్లాడు. సోమవారం ఉదయం కారులో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యాడు. వాహనం వేగంగా వెళ్తున్న క్రమంలో దామరచర్ల మండలకేంద్రంలోని వీరభద్రాపురం నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి రాంగ్‌రూట్‌లోకి వెళ్లింది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనాథ్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీనాథ్ భార్య సింధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. శ్రీనాథ్‌కు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గొర్రెలు మేపుతుండగా..

మిర్యాలగూడ అర్బన్: రైలు ప్రమాదంలో గొర్రెల కాపరి మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండజిల్లా మిర్యాలగూడ రైల్వేస్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. స్థానికులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మిర్యాలగూడ మండలం రాఘవాపురంతండాకు చెందిన రమావత్ పాండ్య(65) గొర్రెల కాపరిగా వెళ్లాడు. పాండ్య చెవుడు ఉన్నట్లు తండావాసులు తెలిపారు. రైలుపట్టాల సమీపంలో 112/18 మైలురాయి వద్ద గొర్రెలు మేపుతుండగా కొన్ని జీవాలు రైలుపట్టాలపైకి వెళ్లాయి. వాటిని పక్కకు తప్పించేందుకు రైలుపట్టాలపైకి వెళ్లిన కాపరి పాండ్య చెవుడుతో సికింద్రాబాద్ నుంచి శబరి వైపు వెళ్తున్న 17230 నెంబరుగల రైలు శబ్దాన్ని గ్రహించలేకపోయాడు. అప్పటికే వేగంగా దగ్గరకు దూసుకొచ్చిన రైలు నుంచి తప్పించుకునే క్రమంలో ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. పాండ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పాండ్య కుమారుడు రమావత్ మగ్గా ఫిర్యాదు మేరకు నల్లగొండ జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

77 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

వలిగొండ, ఆగస్టు 12: యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం చిత్తాపురం గ్రామ శివారులోని ఓ షెడ్డులో నిల్వ చేసిన 52 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్, విజిలెన్స్ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. భువనగిరి మండలం పచ్చర్లబోడుతండాకు చెందిన ధరావత్ మహేందర్ వలిగొండ మండలంలోని చిత్తాపురం గ్రామంలో ఒక వ్యవసాయ క్షేత్రంలోని షెడ్డులో రేషన్ బియ్యం నిల్వ చేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు సివిల్ సప్లయ్, విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి 52క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించారు. మహేందర్‌పై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సీఐ షేక్‌గౌస్, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ బాలమణి పాల్గొన్నారు.

మిర్యాలగూడ అర్బన్: జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 25క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో రేషన్ బియ్యం నిల్వలు ఉన్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం వన్‌టౌన్ సీఐ ఆధ్వర్యంలో దాడి చేశారు. కాలనీకి చెందిన రమణ ఓ రహస్య ప్రదేశంలో అద్దెకు తీసుకున్న షెడ్డులో రేషన్ బియ్యం డంపుచేసి ఇతర ప్రాంతానికి అక్రమంగా తరలించేందుకు సిద్ధమవుతుండగా విశ్వసనీయ సమాచారం తనిఖీలు జరిపినట్లు పోలీసులు తెలిపారు. తనిఖీలు జరిపి నిల్వ ఉన్న రేషన్ బియ్యాన్ని స్వాధీనపర్చుకొని నిందితుడిపై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ సుధాకర్ తెలిపారు.

గ్యాస్ లీకై వ్యాన్ దగ్ధం



తిప్పర్తి, ఆగస్టు 12: గ్యాస్ లీకై వ్యాన్ దగ్ధమైంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల పరిధిలోని చిన్నాయిగూడెం గ్రామ సమీపంలో సోమ వారం జరిగింది. మండలంలోని సర్వారం గ్రామానికి చెందిన సుంకరబోయిన రమేష్ స్కూల్ పిల్లలను తీసుకెళ్లడానికి గత సంవత్సరం సెకండ్ హ్యాండ్ మారుతి ఓమ్ని వ్యాన్‌ను కొనుగోలు చేశాడు. కొన్ని రోజులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులను తీసుకెళ్లేందుకు ఉపయోగించాడు. వాహనం మరమ్మతులకు గురికావడంతో అక్కడ మానేసి నల్లగొండలోని ఓ గ్యారేజ్‌లో రిపేర్ చేసుకొని వస్తున్నాడు. తిప్పర్తి సమీపంలోకి రాగానే ఒక్కసారిగా వాహనం ఆగిపోయింది. పొగలు రావడంతో భయాందోళనకు గురైన రమేష్ వాహనం దిగి పక్కకు వెళ్లాడు. పెద్ద ఎత్తున మంట రావడంతో 100కు డయల్ చేయగా అక్కడికి చేరుకున్న పోలీసులు నల్లగొండ ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేశారు. ఈ ప్రమాదానికి వాహనంలో గ్యాస్ లీకేజీనే కారణమని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో వాహనంలో ఎవ్వరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని చర్చించుకుంటున్నారు.

ఏడు గొర్రె పొటేళ్ల చోరీ

తుర్కపల్లి, ఆగస్టు 12: యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం బీల్యానాయక్‌తండాలో భూక్య లచ్చిరాంనాయక్‌కు చెందిన ఏడు గొర్రె పోటేళ్లను ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. బాధిత రైతుకు రూ.1.20లక్షలు నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన లచ్చిరాంనాయక్ తన గొర్రెలను పొద్దంతా అడవిలో మేపి సాయంత్రం తన వ్యవసాయ బావి వద్ద ఏర్పాటు చేసిన గొర్రెల పాకలో గొర్రెలన్నింటినీ ఉంచి ఇంటికి వచ్చాడు. సోమవారం తెల్లవారుజామున మంద వద్దకు వచ్చి చూసే సరికి మందలో ఏడు గొర్రె పొటేళ్లు లేవనే విషయాన్ని గుర్తించాడు. వాటి ఆచూకీ కోసం పరిసరాలు వెతికినా దొరకలేదని తెలిపాడు. తన గొర్రె పొటేళ్లను దొంగలే ఎత్తుకెళ్లారని, దీంతో తనకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



నార్కట్‌పల్లి, ఆగస్టు 12: కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలానికి చెందిన అక్కా చెల్లెళ్లు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. ఈ నెల 11, 12వ తేదీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో విక్టరీ షాటోకాన్ 12వ జాతీయ స్థాయి కరాటే ఛాంపి యన్ షిప్ పోటీలు జరిగాయి. కుమితేలో అండర్-14 బాలికల విభాగం 38 కేజీల కేటగిరీలో మండలంలోని బీ.వెల్లెంల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని దాసోజు సౌమ్య బంగారు పతకం సాధించింది. అండర్-17 బాలికల విభాగం సీనియర్ లేవల్ కటాస్‌లో సౌమ్య సోదరి ఇదే పాఠశాల పూర్వ విద్యార్థిని దాసోజు సంజన కూడా ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించినట్లు జిల్లా కరాటే చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ దాసోజు నర్సింహ్మాచారి తెలిపారు. పతకాలు సాధించిన అక్కా చెల్లెళ్లను పలువురు అభినందించారు.

విద్యార్థులకు బంగారు పతకాలు



మోత్కూరు: హైదరాబాద్‌లోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర కరాటే అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 11 వరకు నిర్వహించిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో మోత్కూరు మండలం దాచారం విద్యార్థులు ప్రతిభ చాటి పలు విభాగాల్లో పది బంగారు పతకాలు సాధించారు. ఈ పోటీల్లో వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి సుమారు 1500 మంది కరాటే క్రీడాకారులు పాల్గొన్నారు. కటా విభాగంలో సిహెచ్. అభిరామ్, ఎల్.హర్షిత, సిహెచ్. చరణ్‌తేజ్, ఫైట్ విభాగంలో సిహెచ్.అభిరామ్, సిహెచ్.చరణ్‌తేజ్ బంగారు పతకాలు, కటా విభాగంలో ఎం. కార్తీక్ రజత పతకం, బి. నిఖిల, ఎం. మణిదీప్, సిహెచ్. రాజు, సిహెచ్. చరణ్ సిల్వర్ పతకాలు సాధించారని కరాటే కోచ్ డాక్టర్ వేముల సైదులు తెలిపారు. ఆయనను బెస్ట్ కోచ్ అవార్డుతో సన్మానించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

ఆత్మకూరు(ఎం) ఆగస్టు 12: యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని మొరిపిరాల గ్రామపంచాయతీ మదిరె పొలిమెరాజులబావి గ్రామంలో నిమ్మల దశరథ అనే రైతుకు చెందిన కాడి ఎద్దు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో సోమవారం మృతిచెందింది. సదరు రైతు తన పత్తి చేనులో గుంటుక తోలడానికి నాగలితో కూడిన ఎడ్లను పక్క రైతు పొలంలో నుంచి తోలుకొని వెళ్తుండగా కర్రలపై వేలాడుతున్న కరెంట్ తీగలు ప్రమాదవశాత్తు ఎడ్లకు తగలగా గమనించిన రైతు వెంటనే తన చేతి కర్రతో తీగలపై కొట్టాడు. ఈ ప్రమాదంలో ఒక ఎద్దు తప్పించుకోగ రెండవ ఎద్దు విద్యుదాఘాతంతో అక్కడేపడి మృతిచెందినట్లు బాధిత రైతు వాపోయాడు. ఎద్దు విలువ సుమారు రూ. 85వేలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

గీత కార్మికుడికి గాయాలు

అడ్డగూడూరు, ఆగస్టు 12: తాటిచెట్టుపై నుంచిపడి గీత కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం చిన్నపడిశాల గ్రామంలో జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అంబటి చిన్న యాదయ్య రోజు మాదిరిగానే కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. కిందికి దిగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు మోకు జారి చెట్టుపై నుంచి కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో యాదయ్యను చికిత్సనిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

శాలిగౌరారం, ఆగస్టు 12: నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామ శివారులో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిగాయి. గుర్తుతెలియని వ్యక్తులు రాతి విగ్రహాన్ని ఎత్తుకెళ్లారు. గ్రామస్థులు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ డి. సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తలూరు గ్రామ శివారులో అంబారిపేట వెళ్లే దారిలో బోయనపెల్లి సోమేశ్వరరావు భూమిలో ఉన్న పురాతన గౌడ కుల దైవం కాటమయ్య గుడిలో ఆదివారం రాత్రి తవ్వకాలు జరిగాయి. దుండగులు రాతి విగ్రహాన్ని ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన శంకర్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం : వీరేశం



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

కట్టంగూరు, ఆగస్టు 12: ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు వరమని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కట్టంగూరు మండలంలోని 61 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.23.84 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను నకిరేకల్‌లోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మాద యాదగిరి, మాజీ ఎంపీపీలు రెడ్డిపల్లి సాగర్, కొండ లింగస్వామి, మాజీ సర్పంచ్ అయితగోని నారాయణ, మాజీ ఎంపీటీసీ చింత వెంకటనర్సయ్య, మిట్టపల్లి శివశంకర్, కుంభం అనిల్‌రెడ్డి, గడుసు సుధీర్‌రెడ్డి, మర్రి రాజు, బండారు ఆనంద్, తండు గిరి తదితరులు పాల్గొన్నారు.

● **తిప్పర్తి:** పలు అనారోగ్య సమస్యలతో చికిత్స చేయించుకున్న బాధితులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. తిప్పర్తి, మాడ్గులపల్లి మండలాలలోని సుమారు 75 మంది బాధితులకు రూ.30లక్షల విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆయన వెంట నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, నాయకులు కిన్నెర అంజి, జాకటి మోష, రొట్టెల రమేష్, రాగి మురళి, మర్రి యాదగిరి, ఉయ్యాల నాగరాజు, పోకల సతీష్, పేరం వెంకన్న పాల్గొన్నారు.

ఆగస్టు 15 వేడుకలను ఘనంగా నిర్వహించాలి



ఎంఈవో, హెచ్‌ఎంలతో మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి

తిప్పర్తి, ఆగస్టు 12: మండలంలో ఆగస్టు 15 వేడుకలను ఘనంగా నిర్వహించాలని మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాలగా ఎంపికైంది. ఈ సందర్భంగా ఆగస్టు 15వ తేదీన పాఠశాలలో నిర్వహించే సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని మండల ప్రత్యేక అధికారి చెదురుపల్లి విష్ణుకు రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో తిప్పర్తి పాఠశాల మోడల్ పాఠశాలగా ఎంపికవడం సంతోషకరమన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, ఎంఈవో అరుంధతి, హెచ్‌ఎం నరసింహనాయక్, మాజీ సర్పంచులు జాకటి మోష, రొట్టెల రమేష్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు నామిరెడ్డి మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : సీఐ

దేవరకొండ, ఆగస్టు 12: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దేవరకొండ సీఐ నర్సింహులు సూచించారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ మోసాలకు పాల్పడితే 1930 నెంబర్‌కు తక్షణమే ఫోన్ చేయాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సీఐ కోరారు.

వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ



ఎస్‌ఐకి విరాళాలు అందజేస్తున్న సీపీఎం నాయకులు

నిడమనూరు, ఆగస్టు 12: కేరళలోని వయనాడ్‌లో వరదల కారణంగా నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం విరాళాలు సేకరించారు. దుకాణదారులు, పౌరుల నుంచి రూ.13786ను విరాళాలు సేకరించారు. ఆ విరాళాన్ని ఎస్‌ఐ గోపాల్‌రావు చేతుల మీదుగా పార్టీ జిల్లా కార్యాలయానికి పంపించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను మాట్లాడుతూ వయనాడ్ బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మండల కార్యదర్శి కందుకూరి కోటేష్, కత్తి లింగారెడ్డి, కొమాండ్ల గుర్వయ్య, కుంచం శేఖర్, బాలనారాయణ, మెరుగు రాములు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి తగ్గిన ఫిర్యాదులు

శాలిగౌరారం, ఆగస్టు 12: శాలిగౌరారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణికి స్పందన కరువైంది. గతంలో ఇచ్చిన ఫిర్యాదులు పరిష్కారం కాకపోవడంతో ప్రజావాణిలో తమ ఫిర్యాదులను ఇవ్వడానికి ప్రజలు ముందుకు రావడం లేదు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించి ప్రజావాణిలో కేవలం 5 ఫిర్యాదులు మాత్రమే వచ్చాయి. అవి కూడా భూ సమస్యలపై ఫిర్యాదులు వచ్చినట్లు మండల ప్రత్యేకాధికారి రామారావు నాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ మహ్మద్ అబ్దుల్ సత్తార్, ఎంపీడీవో జ్యోతిలక్ష్మి, ఏవో సౌమ్యశృతి, అధికారులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 26 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో రాంరెడ్డి తెలిపారు. రెవెన్యూ విభాగానికి సంబంధించి 2, వ్యవసాయ శాఖ 1, ఎంపీడీవో కార్యాలయానికి సంబంధించి 23 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఇలా.. ప్రయాణమెలా..

▸▸ అధ్వానంగా రహదారులు

▸▸ పట్టించుకోని అధికారులు



మోకాలు లోతు గుంతలతో అధ్వానంగా మారిన శాలిగౌరారం నుంచి బైరవునిబండ రోడ్డు

శాలిగౌరారం, ఆగస్టు 12: శాలిగౌరారం మండలంలోని పలు ప్రధాన రోడ్లు నరకకూపాలుగా మారాయి. తారురోడ్లు పూర్తిగా దెబ్బతిని రూపురేఖలు లేకుండాపోయాయి. ఫలితంగా ఆయా రోడ్లపై ప్రయాణించాలంటే ప్రయాణికులు భయపడుతున్నారు. అడగడుగునా గుంతలతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. ఎమ్మెల్యే రోడ్ల మరమ్మతులు గురించి పట్టించుకోవడం లేదని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్ల మీద ఉన్న గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుండటంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. శాలిగౌరారం ఎంపీడీవో కార్యాలయం నుంచి బైరవునిబండ వరకు ఉన్న పంచాయతీరాజ్ రోడ్డు, శాలిగౌరారం బస్ స్టేజీ నుంచి దోనబండ వరకు ఉన్న పంచాయతీరాజ్ రోడ్డుపై కూడా అడుగడుగునా మోకాళ్ల లోతు గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డుపై కనీస కాలినడకన వెళ్లడానికి కూడా ప్రజలు అవస్థలు పడుతున్నారు. గురజాల నుంచి రామాంజపురం వరకు, శాలిగౌరారం నుంచి ఆకారం మీదుగా కట్టంగూరు వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. మాదారం నుంచి ఇటు కలపహాడ్ వరకుఉన్న రోడ్లు కూడా అధ్వానంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు ఎప్పటికైనా ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

డబుల్ రోడ్డుగా మార్చాలి



శాలిగౌరారం ఎంపీడీవో కార్యాలయం నుంచి బైరవునిబండ వరకు ఉన్న పంచాయతీరాజ్ రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డు పూర్తిగా దెబ్బతిని అడగడుగునా గుంతలు ఉన్నాయి. మోకాళ్ల లోతు గుంతలు ఉండటంతో బైక్‌పై వెళ్లాలంటే భయంగా ఉంది. నిత్యం ఎంతో వాహనాలతో రద్దీగా ఉండే ఈ రోడ్డుపై ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డులో పోలీస్‌స్టేషన్ నుంచి బాలిశెట్టిగూడెం, తిరుమలరాయునిగూడెం, జాలోనిగూడెం వరకు రోడ్డు రూపురేఖలే మారిపోయాయి. వెంటనే ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోని ఈ రోడ్డును డబుల్‌రోడ్డుగా ఏర్పాటు చేయాలి.

\- కొప్పుల నాగరాజు, బాలిశెట్టిగూడెం

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



దేవరకొండ: ర్యాలీ నిర్వహించి మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్

దేవరకొండ, కనగల్, చింతపల్లి, హాలియా, ఆగస్టు 12: యువత, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని, మాదక ద్రవ్యాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ అన్నారు. ఎక్సైజ్, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం దేవరకొండలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వల్ల దుష్పరిణామాలు ఎదురవుతాయని అన్నారు. అనంతరం మీనాక్షి సెంటర్‌లో మాదక ద్రవ్యాల రహితంగా మార్చాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐలు నర్సింహ, నర్సింగరావు, ఎంకేఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● కనగల్ మండలంలోని చర్లగౌరారం పాఠశాలలో మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్‌ఐ విష్ణు మాట్లాడారు. మాదకద్రవ్యాల వాడకాన్ని నియంత్రించాలని అన్నారు. మాదకద్రవ్యాల వ్యసనానికి లోనైతే జీవితం ఆగమైపోతుందని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాంబాబు పీసీలు జంగయ్య, రవీందర్‌రెడ్డి, సైదులు, బుర్హానుద్దీన్, దస్తగిరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● చింతపల్లి మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో సోమవారం మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈవో గురువారావు తెలిపారు.

● హాలియాలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హాలియా ఎక్సైజ్ సీఐ కల్పన, సీఐ జనార్దన్‌గౌడ్‌లు మాట్లాడుతూ డ్రగ్స్ వాడి యువకులు తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని అన్నారు. పరిసరాల్లో ఎవరైనా మత్తు పదార్థాలు వాడుతుంటే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, మెరుగైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సతీష్‌రెడ్డి, ఎక్సైజ్ ఎస్‌ఐ సంపత్‌బాబు, ఐడీ పార్టీ సిబ్బంది శ్రవణ్, ఎక్సైజ్ సిబ్బంది కిరణ్, వసంత, రహీం, శ్రీనివాస్, సుధాకర్, జహంగీర్, చిన్ని పాల్గొన్నారు.



హాలియాలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న పోలీసులు, విద్యార్థులు

ఇళ్లపై మువ్వన్నెల జెండా ఎగురవేయాలి : బీజేపీ



మిర్యాలగూడలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

మిర్యాలగూడటౌన్, మునుగోడు, ఆగస్టు 12: పంద్రాగస్టు సందర్భంగా ప్రతీ ఇంటిపై త్రివర్ణ జెండా ఎగరవేయాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొండేటి సరిత, బీజేపీ జిల్లా ఉపాధ్యక్ష, కార్యదర్శి, అధికార ప్రతినిధి వేణుకుమార్, బొడిగె అశోక్‌గౌడ్, నరేందర్‌గౌడ్‌లు అన్నారు. హర్ ఘర్ తిరంగ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మిర్యాలగూడ, మునుగోడులో తిరంగా యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజును పండుగలా నిర్వహించుకోవాలని, ప్రతీ ఇంటిపై జాతీయజెండా ఎగరవేసి దేశభక్తిని చాటుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ కార్యక్రమంలో స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలన్నారు. మిర్యాలగూడలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాధినేని శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, ఎడ్ల రమేష్, పురుషోత్తంరెడ్డి, రమాదేవి, మునుగోడులో బీజేపీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్యయాదవ్, నాయకులు కమ్మంపాటి నర్సింహ, శంభోగౌడ్, సతీష్, యాదయ్య, బ్రహ్మాచారి, క్రాంతి, జానీ, శేఖర్, మాధవరెడ్డి, శంకర్, నరేష్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై సదస్సు నేడు

కేతేపల్లి, ఆగస్టు 12: మాదకద్రవ్యాల నిర్మూలనపై కేతేపల్లిలోని రైతువేదికలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏవో బి.పురుషోత్తం తెలిపారు. పోలీస్, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సదస్సులో గంజాయి, డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలు, నిర్మూలించాల్సిన ఆవశ్యకతను వివరించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, రైతులు, యువకులు హాజరుకావాలని ఆయన కోరారు.

'తీజ్' ఉత్సవం గిరిజన సంస్కృతికి ప్రతీక



ఎంజీయూలో తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు

నల్లగొండ కల్చరల్, ఆగస్టు 12: తీజ్ ఉత్సవాలు గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు, పర్యావరణ హిత జీవనానికి ప్రతీకగా నిలుస్తాయని ఎంజీయూ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ అల్వాల రవి అన్నారు. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఎస్సీ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బంజారా విద్యార్థుల తీజ్ పండుగ ఉత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. శ్రావణ మాసంలో 9 రోజుల పాటు గిరిజన యువతులు తమ సంప్రదాయక పద్ధతుల్లో కుటుంబాలు, ఆవాసాలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తారని తెలిపారు. చివరి రోజున గోధుమ గడ్డి మొలకలు అందుకు ప్రతీకగా భావించి ఉత్సవాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీసెల్ డైరెక్టర్ మద్దిలేటి మాట్లాడుతూ భిన్నత్వాలకు ఆలవాలమైన భారతదేశంలో ప్రతి ఒక్కరూ వారి పద్ధతుల్లో సర్వమానవాళి శ్రేయస్సు, పర్యావరణహితం కోసం ఉత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం విద్యార్థుల సంప్రదాయ నృత్యాలు అందిరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ మారం వెంకటరమణారెడ్డి, డాక్టర్ రామావత్ మురళి, విద్యార్థులు రవీందర్, సురేష్, శ్రీధర్, అజేష్, శ్రేయ, మేఘమాల, రమాదేవి, అనసూయ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక రుణాన్ని బ్యాంకుకు చెల్లించాలి : ఏడీఏ



రుణమాఫీపై రైతుల వినతులను స్వీకరిస్తున్న ఏడీఏ నాగమణి

మిర్యాలగూడ, ఆగస్టు 12: రైతులు రెండు లక్షలకు పైబడి ఉన్న రుణాన్ని బ్యాంకుకు చెల్లించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు పోరెడ్డి నాగమణి అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో రుణమాఫీకి సంబంధించిన వినతుల స్వీకరణ, పరిష్కారాల ప్రత్యేక కౌంటర్‌ను సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. రుణమాఫీ 2024 పథకం కింద ఇప్పటి వరకు కుటుంబానికి రూ. 1.50లక్షల వరకు రైతులు రుణమాఫీ పొందారని, మూడో విడతలో రూ.2లక్షల వరకు మాఫీ పొందుతారని అన్నారు. రెండు లక్షల రుణం మినహించి మిగిలిన డబ్బులను వడ్డీతో సహా సంబంధిత బ్యాంకులో చెల్లించి రుణమాఫీ లబ్ధి పొందాలని సూచించారు. రూ.2లక్షల కంటే ఎక్కువ రుణం ఉంటే కుటుంబంలో రుణం తీసుకున్న మహిళల రుణాన్ని మొదట మాఫీ చేసి మిగులు మొత్తాన్ని దామాషా పద్ధతిలో కుటుంబంలో పురుషుల పేరుమీద ఉన్న రుణాన్ని మాఫీ చేస్తారని అన్నారు. రుణమాఫీకి సంబంధించి రైతుల నుంచి 15 వినతులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏవో గుర్రం సరిత, వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య ఉద్యమంలో ఏఐఎస్‌ఎఫ్ కీలకపాత్ర

హాలియా, ఆగస్టు 12: భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఏఐఎస్‌ఎఫ్ కీలకపాత్ర పోషించిందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ శోభన్‌బాబు అన్నారు. హాలియాలో ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం సంఘం జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్ర్యం రాక పూర్వమే ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో నగరంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుకదేవ్, ఆజాద్ ఎందరో అమరవీరుల ఆశయ సాధన కోసం బబ్బుద్దీన్ బాన, ప్రేమ్ నారాయణ భార్గవ్‌ల నాయకత్వంలో 1936 ఆగస్టు 12న ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భవించిందన్నారు. మలిదశ తెలంగాణ పోరాటం, సంక్షేమ, గురుకుల హాస్టళ్ల సమస్యలపై, విద్యా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పాలకులపై అలుపెరగని సమరశీల పోరాటాలు చేసి ఎన్నో విజయాలు సాధించిన ఘనత ఏఐఎస్‌ఎఫ్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ నాయకులు రూపావత్ విష్ణునాయక్, నాయకులు సంతోష్, శ్రీరామ్, అఖిల్, సిద్దు, జగన్, చరణ్, గణేష్, మధు, అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

● **దేవరకొండ:** విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థుల పక్షాన నిరంతరం పోరాటాలు చేస్తుందని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో ఆయన పాల్గొని సంఘం జెండాను ఎగురవేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు వినయ్, నాయకులు శంషుద్దీన్, ఏఐటీయూసీ డివిజన్ కోశాధికారి జూలూరి వెంకట్రాములు, ఏఐవైఎఫ్, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు భద్రత కల్పించాలి



పీఏపల్లిలో మృతి చెందిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

శాలిగౌరారం, పెద్ద అడిశర్లపల్లి, మిర్యాలగూడటౌన్, ఆగస్టు 12: సమగ్రశిక్ష ఉద్యోగులకు భద్రత కల్పించి అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మోలుగూరి కృష్ణ కోరారు. సమగ్ర శిక్షలో వివిధ హోదాల్లో పనిచేస్తూ విధి నిర్వహణలో మృతి చెందిన ఉద్యోగులకు సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేనందున, తక్కువ వేతనాలతో కాలాన్ని వెల్లదీస్తున్నారని అన్నారు. పని తీవ్రత పెరగడం, పెరిగిన నిత్యవసరాల ధరల కారణంగా కుటుంబ పోషణ భారమైనందున ప్రభుత్వం జీతాలను పెంచాలని కోరారు. చాలీచాలని జీతాలతో పనిచేస్తూ.. పని ఒత్తిడి పెరిగి మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమను క్రమబద్ధీకరణ చేసి తక్షణమే బేసిక్ పే అమలు చేయాలని, ఆరోగ్య బీమా ఐదు లక్షలు, జీవిత బీమా 10లక్షలు ఉద్యోగ విరమణ చేసిన వారికి 10 లక్షల ప్రయోజనం కల్పించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా బాధ్యులు కొండ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి చిత్తలూరి భిక్షమయ్య, తీ, మెసేంజర్ బండారు పరమేష్, పీఏపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో బి. వెంకట్, ప్రేమ్‌కుమార్, నరేష్‌కుమార్, లింగయ్య, గోవింద్, రవీందర్, పావని, లక్ష్మి, సుజాత, కల్యాణి, రాందాసు, సావిత్రి, మిర్యాలగూడలో నిరంజన్, హారిక, రేణుక, జ్యోతి, గోవర్ధనాచారి, బ్రహ్మాచారి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాగరాజు

హాలియా: బీసీ సంఘం యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా హాలియాకు చెందిన గద్దె నాగరాజును నియమించారు. ఈ సందర్భంగా బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నియామక పత్రాన్ని అందజేసి మాట్లాడారు. బీసీ సమస్యలపై పోరాటం చేయాలని, బీసీలను రాజకీయంగా సమీకృతం చేసి ఐక్య పోరాటాలు చేస్తేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో నీలం వెంకటేష్, ఓయూ జేఏసీ చైర్మన్ రాజు నేత, సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, రామకృష్ణ, మహేష్, రాము పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...


నార్కట్‌పల్లి: కాంట్రాక్ట్ జూనియర్ లైన్‌మెన్‌లు(సీజేఎల్‌ఎం)గా నియామకమై పదవీ విరమణ పొందిన తమకు ఉద్యోగులందరి మాదిరిగానే పింఛన్ వర్తింపజేయాలని విలేజ్ ఎలక్ట్రిసిటీ వర్కర్ (వీఈడబ్ల్యూ)ల సంఘం ఉమ్మడి జిల్లా నాయకులు మొద్దు గోపాల్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, ఎస్.లక్ష్మయ్య, హుసేన్, శ్రీనివాసరావు కోరారు. 1987నుంచి చాలా తక్కువ వేతనంతో సంవత్సరాలు పనిచేశామని తెలిపారు. 1998లో 75, 2004లో 250 మందిని సీజేఎల్‌ఎంలుగా గుర్తించి రెగ్యులర్ చేసినట్లు తెలిపారు. వారికి పదవీ విరమణ తర్వాత ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పెన్షన్ వర్తించడం లేదని ఆవేదన చెందారు. సీజేఎల్‌ఎంలుగా నియామకమై పదవీ విరమణ పొందిన ప్రతీ ఒక్కరికీ పింఛన్ వర్తించేలా చర్యలు తీసుకుని తమ కుటుంబాలకు అండగా ఉండాలని కోరారు.

దేవరకొండ: అమరుల ఆశయ సాధన కోసం పునరంకితం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సత్యం అన్నారు. మండలంలోని పడ్మట్‌పల్లిలో సీపీఐ సీనియర్‌నేత దివంగత కాటం లక్ష్మయ్య స్తూప ఆవిష్కరణలో పాల్గొని మాట్లాడారు. లక్ష్మయ్య సీపీఐ బలోపేతానికి ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. ఆయన మృతి పార్టీకి తీరనిలోటని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, షైనొద్దిన్, మండల కార్యదర్శి షైనుద్దీన్, సుదర్శన్‌రెడ్డి, రామస్వామి, పల్లా రంగారెడ్డి, మాజీ సర్పంచ్ కిన్నెర యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: మండలకేంద్రం కేతేపల్లిలో ముత్యాలమ్మ (బోనాల) పండుగ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతీ ఏటా శ్రావణమాసంలో గురువారం ముత్యాలమ్మకు బోనాలు సమర్పించడం ఆనవాయితీ. పండగకు అమ్మవారి ఆలయాన్ని స్థానిక విశ్రాంత ఏఎస్‌ఐ అలుగుబెల్లి జగన్మోహన్‌రెడ్డి స్వంత ఖర్చులతో రంగులతో అందంగా తీర్చిదిద్దారు. ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

హాలియా: అమరవీర జవాన్ ఈరేటి మహేష్ జ్ఞాపకార్థం అమీర్‌అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మదారిగూడెం గ్రామంలోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, కంబాక్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పేరూరు దేవస్థానం చైర్మన్ రిక్కల కొండారెడ్డి మాట్లాడుతూ చిన్న వయస్సులోనే మహేష్ దేశసేవ కోసం ఆర్మీలో చేరడం, దురదృష్టవశాత్తు మృతి చెందడం బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వీరాసింగ్, ఫౌండేషన్ నిర్వాహకులు అమీర్‌అలీ, పార్వతమ్మ, సైదులు, రావుల వెంకటేశ్వర్లు, నజీర్‌పాష, పోషం శ్రీనివాస్, సర్వర్, జాని, కట్టా మనోహర్, చెన్ను నర్సింహారెడ్డి, మధు, శ్రీను, జానీ, జహీర్ పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని అంగడిపేట తండాలో ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సహకారంతో సుమారు రూ. 1.30లక్షలతో రెండు బోర్ మోటార్లను ఏర్పాటు చేసినట్లు మాజీ సర్పంచ్ రమావత్ పాండునాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండాలో నీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో రెండు బోర్ మోటార్లకు ప్రెషరింగ్ పెట్టించి మోటార్లను బిగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రమావత్ చిరంజీవి, రాంకోటి, గోపా, మోతీలాల్, దస్రు, లిమ్యా, జర్పుల హర్య, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



నాగరాజు

కట్టంగూరు: భారతీయ జనతా పార్టీ యువ మోర్చా మండల అధ్యక్షుడిగా కట్టంగూరుకు చెందిన బత్తిని నాగరాజును నియమిస్తూ ఆ పార్టీ మండల అధ్యక్షుడు పబ్బు వెంకటేశ్వర్లు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మండలంలో బీజేపీ బలోపేతానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

మునుగోడు రూరల్: మండలంలోని గూడపూర్‌లో స్వాతంత్ర పోరాటంలో పాల్గొని మృతి చెందిన నన్నూరి రమణారెడ్డి సతీమణి నన్నూరి లక్ష్మమ్మని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనం వేణుకుమార్ సన్మానించారు. కార్యక్రమంలో కంభంపాటి నరసింహ, కిసాన్ మోర్చా మండల అధికార ప్రతినిధి దేశిడి వెంకన్న, ప్రధాన కార్యదర్శి అక్కినపల్లి సతీష్, బూత్ అధ్యక్షుడు వేముల శ్రీరంగం తదితరులు పాల్గొన్నారు.

కనగల్: మండలంలోని పర్వతగిరి గ్రామ పంచాయతీ పరిధిలోని కుమ్మరిగూడెం గ్రామంలో కాంగ్రెస్ యువజన నాయకుడు వరికుప్పల రవి రూ. లక్ష విరాళంతో ఏర్పాటు చేసిన వీధి దీపాలను ఏర్పాటు చేశారు. సోమవారం మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి వీధి లైట్లను ప్రారంభించి మాట్లాడారు. యువజన నాయకుడు రవి గ్రామాభివృద్ధికి సొంత నిధులను వెచ్చించటం అభినందనీయమన్నారు. గ్రామంలో నెలకొన్న చీకట్లను తొలగించి వెలుగులు నింపినందుకు గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు నెలుగుందరాశి ముత్తయ్య, సీహెచ్ వెంకట్‌రెడ్డి నాయకులు వెంకట్‌రెడ్డి, రాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాజు

కనగల్: కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడిగా కనగల్ గ్రామానికి చెందిన పందుల రాజు నియమితులయ్యారు. నల్లగొండలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోడ స్వామి నియామక పత్రాన్ని రాజుకు అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ జిల్లా నాయకులు కోడపాటి నగేష్, పెరిక అంజయ్య పాల్గొన్నారు.

కనగల్: మండలంలోని దోరెపల్లి గ్రామంలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక సంస్థ ఆధ్వర్యంలో భగవద్గీత, శ్రీకృష్ణ జన్మాష్టమి ఊరేగింపు విశిష్టతపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిఒక్కరూ భగవద్గీత పఠనం చేయాలని సంస్థ ప్రతినిధులు సూచించారు. కార్యక్రమంలో హిందూజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు పగిడిమర్రి వెంకటేశం. మేకల చంద్రమౌళి, చక్రధర్, పరమేష్, కమలాకర్, లింగస్వామి, సైదులు, నరసింహ, రంగారెడ్డి, వెంకటమ్మ, కవిత, శోభ, మమత, పార్వతమ్మ, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.